## ● ఐక్యతకు 'ఇఫ్తార్' దోహదం



ఇఫ్తార్ విందులో అక్లక్ హుస్సేన్, ముస్లింలు

ముషీరాబాద్, మార్చి 17 ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అక్లక్ హుస్సేన్ అన్నారు. సోమవారం సాయంత్రం భోలక్‌పూర్‌లోని అంజుమాన్ హాల్‌లో అఫీస్ ఉద్దీన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ నిర్వహించారు. ముస్లింలతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన అక్లక్ .. సామూహిక ప్రార్థనలు చేసి విందు ప్రారంభించారు. ఈ పండుగ మాసంలో వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఏర్పాటు చేసే ఇఫ్తార్‌లు పేదలకు ఎంతో దోహదపడుతాయన్నారు. బిలాల్‌మసీదు ముత్తవల్లీ దిల్బర్ హుస్సేన్, నాయకులు ముజీద్ అలీ, సుజిత్ ఉద్దీన్, నవాజ్ పాల్గొన్నారు.

## ● బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించండి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న సీతారాములు, శాంతికుమార్ తదితరులు

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : చేనేత పవర్ లూమ్ పరిశ్రమ, ఉపాధి సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ. 2 వేల కోట్లను కేటాయించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు, అధ్యక్షుడు వనం శాంతికుమార్ తదితరులు విన్నవించారు. సోమవారం డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. త్రిఫ్ట్ పథకంలో ప్రతీ చేనేత కార్మికుడికి, అనుబంధ కార్మికుడికి నెలకు 4 వేల రికరింగ్ డిపాజిట్ కింద బ్యాంకులో జమ చేయాలని కోరామన్నారు. నూలు సబ్సిడీ పథకం కింద నగదు బదిలీ పథకం ద్వారా చేనేత కార్మికులకు నెలకు 3 వేల రూపాయలను వారి అకౌంట్‌లో జమ చేయాలన్నారు. నేతన్న బీమా పథకాన్ని షరతులు లేకుండా అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ● వివాహ వేడుకకు రండి



సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ కుమారుడు నరేన్ సాయిరెడ్డి వివాహ వేడుకకు రావాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దంపతులు సోమవారం ఆహ్వానించారు. ఏప్రిల్ 12న వేడుక జరగనుందని తెలిపారు. ఆ మేరకు పెళ్లి పత్రిక అందజేశారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

## ఇదొక బ్లాక్ డే

### ● దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు కృష్ణ స్వరూప్

కవాడిగూడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించిన రోజు మాల జాతికి బ్లాక్ డేగా దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అభివర్ణించారు. సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో నిరసన వ్యక్తం చేశారు. దళిత కులాల భవిష్యత్‌కు సంబంధించి వర్గీకరణ అంశంపై విస్తృతంగా చర్చించకుండా అసెంబ్లీ ఆమోదించడం సరికాదన్నారు. జస్టిస్ షమీంఅక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదికపై కనీసం చర్చించకుండా బిల్లును ప్రభుత్వం ఆమోదించి మెజార్టీ దళిత కుటుంబాలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. వర్గీకరణపై హైకోర్టులో పలు రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, అయినా వర్గీకరణ బిల్లును ఆమోదించడం వెనక రాజకీయ కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ విషయమై హైకోర్టు, సుప్రీంలో సవాల్ చేస్తామని తెలిపారు. మాల జాతికి ద్రోహం చేసిన మాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దిష్టిబొమ్మలు దహనం చేయడంతోపాటు వారి శవయాత్రలు నిర్వహించి నిరసన తెలియజేయాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు, జాతీయ ప్రధాన కార్యదర్శి సంకు శ్రీనివాసులు. తెలంగాణ రాష్ట్ర స్టేట్ అధ్యక్షుడు జేఎస్‌రావు, పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గోలి నరేష్, గ్రేటర్ నాయకులు మద్దెల ప్రవీణ్‌కుమార్, చుపర్తి సుబ్బారావు, అక్కిదాసు రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ వెంకట్, రంజిత్‌కౌర్ తదితరులు

## కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులు స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ కోర్సులను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సూచించారు. శివం రోడ్‌లోని రంజిత్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ (ఆర్ఎస్‌టీ) ఆధ్వర్యంలో కస్టమర్ రిలేషన్ షిప్ మేనేజ్‌మెంట్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సోమవారం ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ యువకులు ఇలాంటి కోర్సులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి సేవలు అందించే సంస్థలకు ప్రభుత్వపరంగా సహకారం అందించడానికి కృషి చేస్తామన్నారు. ఆర్ఎస్‌టీ సీఈవో రంజిత్‌కౌర్ మాట్లాడుతూ రెండు నెలల పాటు కోర్సులో శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్‌సీ సబ్ రీజినల్ ఎంప్లాయింట్‌మెంట్ అధికారి భూక్య కాశీం, రిహాబిలిటేషన్ అధికారి పంకజ్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కవిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

## నమ్మకమే పరీక్ష భయానికి విరుగుడు

### ● డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : చదివింది రాయగలమన్న నమ్మకమే పరీక్ష భయానికి విరుగుడు అని ప్రోగ్రెసివ్ సైకాలజిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ పేర్కొన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ వాణిశ్రీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసే భయం పోగొట్టేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు ఒత్తిడికి గుడ్‌బై చెప్పి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తూ ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.విజయకుమార్, లయన్ స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలని దీక్ష

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తనకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని మనమాల్ మ్యాన్‌పవర్ సప్లయి యజమాని దోమల మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం నాంపల్లిలోని హైదరాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం ఎదుట దీక్ష నిర్వహించారు. నగరంలో కొనసాగుతున్న హాస్టల్స్‌కు తన సంస్థ నుంచి వంట మనుషులు, కాపలాదారులు, పరిశుభ్రత పనులు చేపట్టే వారిని 2019 జూలై 2021 సెప్టెంబర్ వరకు సప్లయి చేశానన్నారు. వారికి సంబంధించి జీతభత్యాల బిల్లులు కోటి తొమ్మిది లక్షల అరవై ఎనిమిది వేల ఏడువందల రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ బిల్లులను మంజూరు చేయాలని అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోలేదన్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ 9న సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా వారి నుంచి ఎలాంటి స్పందనా రాలేదన్నారు. తన ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. బయట నుంచి అప్పులు తీసుకువచ్చి సిబ్బంది జీతాలు చెల్లించానన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో తనకు ఆత్మహత్యే శరణ్యమని మల్లయ్య తెలిపారు.



## విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

రాంనగర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంట వాంబే కాలనీలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం కంటి వైద్య పరీక్షలు జరిగాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి హాజరై విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు.

● ఇఫ్తార్‌లు మతసామరస్యానికి ప్రతీక అని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి దంపతులు పేర్కొన్నారు. సోమవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో ఉన్న భరత్‌నగర్‌లో నిర్వహించిన ఇఫ్తార్ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# 'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎగ్జామ్ సెంటర్లలో సదుపాయాల కల్పన
- కేంద్రాల వద్ద పోలీసుల పటిష్ట భద్రతా చర్యలు
- ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు ఎగ్జామ్స్



ఎగ్జామ్ సెంటర్‌గా ఎంపికైన ముషీరాబాద్ ఉన్నత పాఠశాల

ముషీరాబాద్, మార్చి 17 ఆంధ్రజ్యోతి): పది పరీక్ష కేంద్రాల్లో సదుపాయాల కోసం విద్యాశాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నది. అందులో భాగంగా గాలి, వెలుగురుతో పాటు తాగునీటి సదుపాయం, ఫ్యాన్‌లు, బెంచీలు, టాయిలెట్స్ సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నది. మండలపరిధిలో మొత్తంగా 23 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. వీటి పరిధిలో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

**ఎగ్జామ్ రాయనున్న 4,807 మంది**

మండల పరిధిలోని 4,807 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయనున్నారు. అందులో 2,363 మంది బాలురు, 2,444 మంది బాలికలు పరీక్షలకు హాజరు కానున్నారు. మండల పరిధిలోని ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 332 మంది విద్యార్థులు ఉన్నారు. ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన వారు 464 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రైవేటుతో పాటు రెసిడెన్షియల్ కు చెందిన 4,011 మంది స్టూడెంట్‌లు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనుంది. విద్యార్థులు 8.30 గంటల లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే హాల్ టికెట్లను పంపిణీ చేశారు.

**ఏర్పాట్లు పూర్తి చేశాం**



పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతీ కేంద్రాన్ని సందర్శించి గాలి, వెలుతురు, మంచి నీటి సౌకర్యం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాం. పరీక్షలు అంటే భయం పోయేలా విద్యార్థులకు ప్రముఖులతో కౌన్సెలింగ్ తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు పరీక్షల్లో రాణించేలా రివిజన్‌తో పాటు స్పెషల్ క్లాసులు తీసుకున్నాం.

- శ్రావణ్ కుమార్, డిప్యూటీ డీఈవో ముషీరాబాద్

## విద్యారంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించండి

### ● ఆమ్‌ఆద్మీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్

కవాడిగూడ, మార్చి17 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని ఆమ్‌ఆద్మీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దోమలగూడలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగం ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల, కళాశాలల సమస్యలను పరిష్కరించాలన్నారు. అందులో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రంలో 90 శాతం పైగా ఉన్న అట్టడుగు వర్గాలు అభివృద్ధి పథంలో పయనించాలంటే విద్యా రంగానికి నిధులు కేటాయించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యా కమిషన్ రిపోర్ట్‌ను వెంటనే అమలు చేయాలన్నారు.

# కాంగ్రెస్ విధానాలను ఎండగట్టండి

- బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపు



బీఆర్ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

ముషీరాబాద్, మార్చి 17 ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకిత భావంతో పనిచేసి బీఆర్ఎస్‌ను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్ రెడ్డి పార్టీ అభ్యున్నతికి చేస్తున్న కృషిని అభినందించి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతానికి బీఆర్ఎస్ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతులను చేయాలని పేర్కొన్నారు. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నియోజకవర్గంలో ఘన విజయం సాధించేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, టెంట్ హౌస్ శ్రీనివాస్, పూసగోరక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత**

చిక్కడపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులు లబ్ధిదారులకు ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠా గోపాల్ అందజేశారు. సోమవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో 7 లక్షల 20 వేల రూపాయల విలువైన చెక్కులను 19 మందికి ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ముఠా జైసింహ, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, వివేక్, పున్న సత్యనారాయణ, గడ్డమీది శ్రీనివాస్, గోస్‌భాయ్, కుమారస్వామి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అండగా ఉండాలి

కవాడిగూడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హాస్టల్స్‌లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులను ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆదుకోవాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు పీఎస్ చారి కోరారు. వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. సోమవారం బుక్స్, పెన్నులు, పెన్సిల్‌లు ఇతర సామగ్రిని హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేశారు. నిరుపేద విద్యార్థులను ఆదుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తొలుపునూరి రమేష్‌గౌడ్, హాస్టల్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు తోడుగా ప్రభుత్వం

నల్లకుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు, ఎస్సీ వర్గీకరణ, దేవాదాయ చట్ట సవరణపై బిల్లులను ప్రవేశపెట్టడం హర్షణీయమన్నారు.

## రేపు శ్రీరమణ అనుగ్రహ తరంగములు గ్రంథావిష్కరణ

చిక్కడపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డా. మద్దాళి సుబ్బారావు రచించిన శ్రీరమణ అనుగ్రహ తరంగములు గ్రంథావిష్కరణ కార్యక్రమం కిన్నెర ఆర్ట్ థియేటర్స్- నృత్య కిన్నెర ఆధ్వర్యంలో ఈనెల 19న త్యాగరాయగానసభలో నిర్వహిస్తున్నారు. సుబ్బారావు 98వ జయంతి సందర్భంగా జరిగే కార్యక్రమంలో ఆంధ్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నూతి రామమోహనరావు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, చారిత్రక నవలా చక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్ ఇన్‌కంటాక్స్ మాజీ చీఫ్ కమిషనర్ నరసింహప్ప అతిథులుగా పాల్గొంటారని నిర్వాహకులు సోమవారం తెలిపారు.

## కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

గోల్నాక, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ ఖండించారు. సోమవారం గోల్నాక డివిజన్ శంకర్‌నగర్ లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్టేషన్‌ఘనపూర్ జరిగిన సభలో సీఎం.. కేసీఆర్‌పై ఇష్టానుసారంగా మాట్లాడారని, ఇది తగదన్నారు. తెలంగాణ జాతిపితను విమర్శిస్తే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని, గట్టిగా బుద్ధి చెప్పతారని ఆయన పేర్కొన్నారు.



చీఫ్ విప్ ఐలయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఆశయ్య తదితరులు

## ప్రభుత్వ చీఫ్ విప్ ఐలయ్యకు వినతి

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరణ చేయాలని తెలంగాణ చేతివృత్తుల సమన్వయకమిటీ కో-కన్వీనర్ పైల్ల ఆశయ్య కోరారు. సోమవారం ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య, ప్రతినిధి బృందానికి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఐలయ్య హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పల్లపు విగ్నేష్, గుమ్మడి నరేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వీధిదీపాలు ఏర్పాటు చేస్తాం : కార్పొరేటర్

చిక్కడపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నూతన స్ట్రీట్‌లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ తెలిపారు. పలు ప్రాంతాల్లో స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆమె ఆయా బస్తీల్లో పర్యటించి నూతన స్ట్రీట్‌లైట్ల ఏర్పాటు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజులుగా పలు బస్తీలు, కాలనీలలో స్ట్రీట్ లైట్ల ఏర్పాటును పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. మరి కొన్నిచోట్ల డార్క్‌స్పాట్లను గుర్తించి వెంటనే లైట్లు ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ వెంట బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నేతలు ఆకుల సురేందర్, జ్ఞానేశ్వర్, అరుణ్‌కుమార్, ప్రశాంత్, స్ట్రీట్‌లైట్స్ సర్కిల్ డిప్యూటీ ఇంజినీర్ అశోక్ కుమార్, సిబ్బంది బాలునాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్‌గా గౌతమ్‌రావు ఏకగ్రీవం

బర్కత్‌పుర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్‌గా డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన సమావేశంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. కో-కన్వీనర్లుగా కె.మల్లికార్జున్, ఎం.హిందూశేఖర్, డీ.ఆర్.ఎస్.నరేంద్ర, జి.ఆనంద్ గౌడ్, సి.కృష్ణగౌడ్, కె.రమేష్‌యాదవ్, ఎడెల్లి అజయ్‌కుమార్, కార్పొరేటర్ వై.అమృత, మీటింగ్ ఆర్గనైజింగ్ టీమ్ సభ్యులుగా కార్పొరేటర్ కన్నె ఉమాదేవిలు ఎన్నికయ్యారు. శోభాయాత్ర టీమ్ సభ్యులుగా ఎన్.బుచ్చిరెడ్డి, కె.అజయ్‌రాజ్‌యాదవ్, వనం రమేష్, పి.గోవర్ధన్‌రెడ్డి, సి.వినోద్‌యాదవ్, కె.ప్రవీణ్‌కుమార్, కె.సునీల్‌కుమార్, ప్రశాంత్ దూబే, ఎ.మహేష్, కల్చరల్ ప్రోగ్రామ్ సభ్యులుగా కెంచె చంద్రశేఖర్, ఆర్.శ్రీనివాస్, డాక్టర్ సమత, కేసరి నర్సింగ్‌రావుయాదవ్, ఆర్.కె.రాంచందర్, ఎ.రమేష్, ఇ.ఆరేందర్, ఎన్.దత్తు, ఇ.రఘునందన్, టి.నాగరాజుచారి, పబ్లిసిటీ సభ్యులు ఎక్కాల నందు, చిట్టి శ్రీధర్, ఎ.సూర్యప్రకాష్‌సింగ్, అరవింద్, మధుయాదవ్, దయాకర్‌యాదవ్ తదితరులు ఎన్నికయ్యారు.

## 'ఆ ట్రస్ట్‌ను రిజిస్టర్ చేయొద్దు'

చిక్కడపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ది ఇండిజీనియస్ చర్చెస్ ఆఫ్ ఇండియా ట్రస్ట్‌ను రిజిస్టర్ చేయవద్దని హెబ్రోన్ ఇవాంజిలిస్ట్‌లు ఎం రూబెన్ ఫ్రాన్సిస్, శాంసన్‌లు వేర్వేరుగా చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఇటీవల మరణించిన ఎఫ్‌సీఎస్ పీటర్‌తోపాటు థియోడర్‌ను కూడా ట్రస్ట్ నుంచి 2018లో తీసివేశారని పేర్కొన్నారు. పీటర్ వేసిన పిటిషన్ సైతం పెండింగ్‌లో ఉందని, ఆర్డర్ కాపీ రానందున పీటర్ థియోడర్‌లు ట్రస్టీలు కాదని తెలిపారు. ఆ కాపీ వచ్చేవరకు ఏ చర్య తీసుకోకుండా ఈ రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## 'నిధులు సక్రమంగా ఖర్చు చేయాలి'

నల్లకుంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా ఖర్చు చేయాలని పలు సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ లో భాగంగా అంబేడ్కర్ అభయహస్తం కింద 12 లక్షల రూపాయలు ఇవ్వాలని వారు కోరారు. సోమవారం ఈ అంశాలపై అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిసి పలు సంఘాల నేతలు వినతిపత్రం సమర్పించారు.

# పోలింగ్ ఏజెంట్ల జాబితాను అందజేయాలి

- అంబర్‌పేట డిప్యూటీ కమిషనర్ దివాకర్




సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ దివాకర్

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అన్ని రాజకీయ పార్టీలు పోలింగ్ ఏజెంట్ల జాబితాను అందజేయాలని అంబర్‌పేట డిప్యూటీ కమిషనర్ మారుతిదివాకర్ సూచించారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 2 లక్షల 79 వేల ఓటర్లు ఉన్నారన్నారు. వీరు ఓటు హక్కు వినియోగించుకోవడానికి 104 భవనాలలో 236 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో నిబంధన ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు తమ పార్టీ తరఫున ఒక్కో బూత్‌కు ఏజెంట్ పేరు, వివరాలను అందజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఈ నెల 21వ తేదీ లోపు సర్కిల్‌లో పెండింగ్‌లో ఉన్న ఫామ్ 6 కొత్త ఓటర్ల నమోదు, ఫామ్ 7 సంబంధించి చనిపోయిన వారి పేర్ల తొలగింపు, ఫామ్ 8కు సంబంధించి చిరునామా, ఇంటి పేరు మార్పుకు సంబంధించిన అన్ని ఫైళ్లను క్లియర్ చేయాలని సర్కిల్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.